

సమాచారశాఖ కమిషనర్ బదిలీ

బెంగళూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమాచారశాఖ కమిషనర్‌గా వ్యవహరిస్తున్న హేమంత్ నింబాల్కర్‌ను ఉన్నఫలంగా బదిలీ చేశారు. సమాచార శాఖ కమిషనర్‌గా సూరల్కర్ వికాస్ కిశోర్ నియమితులయ్యారు. హేమంత్ నింబాల్కర్ భార్య అంజలి నింబాల్కర్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఉత్తరకన్నడ లోక్‌సభ నియోజకవర్గం అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. సమాచారశాఖ కార్యాలయం నుంచే ఆయన ఎన్నికల పర్యవేక్షణ ఏర్పాట్లు చేస్తున్నట్లు వి మర్శలు వచ్చాయి. అందుకు అనుగుణంగా రాష్ట్ర బీజేపీ నేతలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో బదిలీ అనివార్యమైంది.

నేటి నుంచి నామినేషన్ల జోరు

తొలివిడతకు మరో మూడు రోజులే గడువు

రేపు రాష్ట్రానికి అమిత్‌షా రాక



బెంగళూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తొలి విడత నామినేషన్ల ఘట్టం సోమవారం నుంచి జోరందుకోనుంది. ఏప్రిల్ 26న పోలింగ్ జరిగే 14 నియోజకవర్గాల పరిధిలో నామినేషన్ల ఘట్టం మరో మూడు రోజుల్లో ముగియనుంది. రాష్ట్రంలోని 28 లోక్‌సభ నియోజకవర్గాలకు కాంగ్రెస్, బీజేపీ-జేడీఎస్ మైత్రి అభ్యర్థులు ఖరారయ్యారు. తొలి విడత ఎన్నికల నామినేషన్ల ఘట్ట ఆరంభమై నాలుగు రోజులైనా కేవలం రెండు మూడు నియోజకవర్గాల్లో మాత్రమే అభ్యర్థులు దాఖలు చేశారు. బెంగళూరు గ్రామీణ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి డీకే సురేశ్, హాసన్ నుంచి బీజేపీ-జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థి ప్రజ్వల్ రేవణ్ణ నామినేషన్ వేశారు. మిగిలిన నియోజకవర్గాలలో నామినేషన్లు పెద్దగా దాఖలు కాలేదు. అందుకు పలు కారణాలు ఉన్నాయి. అభ్యర్థుల జాబితా పూర్తి కాకపోవడం, అసంతృప్తి వాసులను బుజ్జగించడం, మరోవైపు సీనియర్ నేతలు బిజీగా ఉండడంతో అభ్యర్థులు నామినేషన్లకు సిద్ధం కాలేదు. అన్ని ప్రక్రియలు ముగియడంతో సోమవారం నుంచి కాంగ్రెస్, బీజేపీ-జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థులతోపాటు ఇండిపెండెంట్లు నామినేషన్లకు సిద్ధమవుతున్నారు. బీజేపీ అభ్యర్థుల నామినేషన్లను ఖరారు చేశారు. సోమవారం బెంగళూరు సెంట్రల్ అభ్యర్థి పీసీ మోహన్ నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఉదయం 10 గంటలకు శివాజీనగర్ ముత్యాలమ్మ ఆలయం నుంచి రోడ్‌షో ద్వారా బీబీఎంపీ కార్యాలయానికి చేరుకుంటారు. కార్యక్రమంలో అగ్రనేతలు యడియూరప్ప, ప్రహ్లాద్‌జోషి, సదానందగౌడ, అశోక్, బసవరాజ్ బొమ్మై, సునిల్‌కుమార్‌తోపాటు పలువురు పాల్గొంటారు. 3న మైసూరు అభ్యర్థి యదువీర్ కృష్ణదత్త చామరాజ ఒడయార్ ఉదయం 10 గంటలకు, మధ్యాహ్నం 12.30 గంటలకు చామరాజనగర అభ్యర్థి బాలరాజుల నామినేషన్లకు పార్టీ అధ్యక్షుడు విజయేంద్ర, శ్రీనివాసప్రసాద్, సదానందగౌడ తదితరులు పాల్గొంటారు. అదే రోజున ఉడుపి-చిక్కమగళూరు అభ్యర్థి కోట శ్రీనివాసపూజారి, తుమకూరు అభ్యర్థి సోమణ్ణ, బెంగళూరు ఉత్తర అభ్యర్థి శోభాకరంద్లాజె, దక్షిణకన్నడ అభ్యర్థి కెప్టెన్ బ్రిజేశ్‌చౌట నామినేషన్లు వేస్తారు. 4న బెంగళూరు గ్రామీణ అభ్యర్థి డాక్టర్ సీఎన్ మంజునాథ్ ఉదయం 10.30 గంటలకు రామనగర జిల్లా అధికారి కార్యాలయంలో నామినేషన్ వేస్తారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, జేడీఎస్ నేత కుమారస్వామి, ప్రతిపక్ష నేత ఆర్. అశోక్‌తోపాటు పలువురు పాల్గొంటారు. బెంగళూరు దక్షిణ అభ్యర్థి తేజస్వి సూర్య, చిత్రదుర్గ అభ్యర్థి గోవింద కారజోళ, చిక్కబళ్లాపుర అభ్యర్థి డాక్టర్ సుధాకర్ నామినేషన్లు వేయనున్నారు. అభ్యర్థులతోపాటు రాష్ట్ర పార్టీ ముఖ్యనేతలు పాల్గొనేలా షెడ్యూల్ ఖరారు చేశారు. ప్రతి నామినేషన్ రోడ్‌షోలలోనూ కీలకనేతల ప్రసంగాలు ఉంటాయి. కాంగ్రెస్ పార్టీ ఇప్పటి వరకు బెంగళూరు గ్రామీణ అభ్యర్థి డీకే సురేశ్ మాత్రమే నామినేషన్ దాఖలు చేశారు. మిగిలిన నియోజకవర్గాలలో మూడు రోజుల్లో నామినేషన్లు వేయనున్నారు. సోమవారం బెంగళూరు దక్షిణ అభ్యర్థి సౌమ్యరెడ్డి, మండ్య అభ్యర్థి వెంకటరామేగౌడ, హాసన్ అభ్యర్థి శ్రేయస్ పాటిల్ నామినేషన్ వేస్తుండగా ఏఐసీసీ కార్యదర్శులు అభిషేక్‌దత్త, రోజీ ఎం. జాన్ పాల్గొననున్నారు. 2న దక్షిణకన్నడ అభ్యర్థి జయప్రకాశ్ హెగ్డే నామినేషన్ వేస్తారు. 3న బెంగళూరు సెంట్రల్ మన్సూర్ అలిఖాన్, చామరాజనగర అభ్యర్థి సునిల్‌బోస్, దక్షిణకన్నడ పద్మరాజ్, మైసూరు లక్ష్మణ్ నామినేషన్ వేస్తారు. 4న తుమకూరు అభ్యర్థి ముద్ద హనుమేగౌడ నామినేషన్ దాఖలు చేయనున్నారు. బెంగళూరు ఉత్తర, కోలారు, చిక్కబళ్లాపుర, చిత్రదుర్గ అభ్యర్థులు చివరి రోజున నామినేషన్ వేయనున్నారు. సీఎం సిద్ధరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌తోపాటు పలువురు ప్రముఖ నేతలు నామినేషన్ల దాఖలులో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నారు.

రేపు రాష్ట్రానికి అమిత్‌షా



కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా రాష్ట్రంలో ఎన్నికల ప్రచారానికి మంగళవారం శ్రీకారం చుడుతున్నారు. సోమవారం రాత్రికే బెంగళూరుకు చేరుకునే అమిత్‌షా బీజేపీ ముఖ్యనేతలతో ఎన్నికలపై చర్చిస్తారు. తొలి విడతలో జరిగే 14 నియోజకవర్గాలకు సంబంధించి సమీక్ష జరపనున్నారు. మంగళవారం ఉదయం బీజేపీ - జేడీఎస్ ముఖ్యనేతలతో అల్పాహార విందులో పాల్గొంటారు. ఇరు పార్టీల ముఖ్యనేతలు కలసి పనిచేయాలని దిశానిర్దేశం చేస్తారు. అనంతరం బెంగళూరు పరిధిలోని నాలుగు లోక్‌సభ స్థానాలతోపాటు చిక్కబళ్లాపుర నియోజకవర్గ ముఖ్య కార్యకర్తలతో సమావేశం కానున్నారు. మధ్యాహ్నం మరో ఐదు జిల్లాల కార్యకర్తలతో భేటీ కానున్నారు.

తొలి ప్రచారం డాక్టర్ మంజునాథ్ కోసం...

అమిత్‌షా లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న బెంగళూరు గ్రామీణ నుంచి ప్రారంభించనున్నారు. బీజేపీ-జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థి డాక్టర్ సీఎన్ మంజునాథ్ తరపున చెన్నపట్టణలో రోడ్‌షో నిర్వహిస్తారు. బీజేపీ అగ్రనేతల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నామినేషన్‌ల ఘట్టానికి ముందే శివమొగ్గ, కలబురగి బహిరంగసభలలో ప్రచారం చేశారు. అమిత్‌షా చెన్నపట్టణ నుంచి శ్రీకారం చుట్టి బెంగళూరుతోపాటు మైసూరు ప్రాంతాల్లో పలు బహిరంగసభల్లో పాల్గొనే అవకాశం ఉంది. బెంగళూరు గ్రామీణ నుంచి కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ తమ్ముడు, సిట్టింగ్ ఎంపీ డీకే సురేశ్ పోటీ చేస్తుండడంతో ఇక్కడ ప్రతిష్టాత్మకమైంది.

బెళగావి ఎన్నికల బరిలోకి

ఎంఈఎస్

కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల బెంబేలు



బెంగళూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): బెళగావి జిల్లా పరిధిలోని బెళగావి, చిక్కోడి నియోజకవర్గాల్లో మహారాష్ట్ర ఏకీకరణ సమితి (ఎంఈఎస్) అభ్యర్థులను బరిలోకి దించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఎంఈఎస్ నాయకుల ప్రయత్నాలతో బెళగావి బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు బెంబేలెత్తుతున్నారు. బెళగావి లోక్‌సభ పరిధిలో మరాఠీలు అత్యధికంగా నివసిస్తున్నారు. బెళగావి నగరంతోపాటు ప్రతి గ్రామంలోనూ మరాఠాల ప్రాబల్యం అత్యధికంగా ఉంది. ఇదే కారణంతోనే తరచూ సరిహద్దు వివాదం తారస్థాయికి చేరుతుంటుంది. కాంగ్రెస్ నుంచి మంత్రి లక్ష్మీహెబ్బాళ్కర్ కుమారుడు మృణాల్ హెబ్బాళ్కర్ బరిలో ఉండగా బీజేపీ-జేడీఎస్‌ల ఉమ్మడి అభ్యర్థిగా జగదీశ్ శెట్టర్ పోటీలో ఉన్నారు. ఎంఈఎస్ పోటీలోకి దిగితే ఓట్లు చీలుతాయనే భయం ఇరుపార్టీల అభ్యర్థులను వెంటాడుతోంది. బీజేపీకి మరాఠాలు సుదీర్ఘకాలంగా మద్దతు ఇస్తున్నారు. ఎంఈఎస్ అభ్యర్థి పోటీ చేస్తే వారికి ఓటింగ్‌శాతం గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. ఎన్నికల్లో పోటీ చేసే అంశమై ఎంఈఎస్ ముఖ్యులు రమాకాంత్ కొండొస్కర్ ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. రమాకాంత్‌తోపాటు మరో ఇద్దరి పేర్లను పోటీకోసం ప్రస్తావించారు. సరిహద్దు సమస్యను పరిష్కరించడంలో కేంద్రప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఎంఈఎస్ తన అభ్యర్థులను పోటీ చేయించాలని భావిస్తోంది. 1996లో అమలు చేసిన మాస్టర్‌ప్లాన్‌ను మరోసారి తెరపైకి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. 1996లో 452 మంది మరాఠా అభ్యర్థులను బరిలో నిలిపారు. అప్పట్లో బ్యాలెట్ ద్వారా ఎన్నికలు జరుగుతుండేవి. బ్యాలెట్లను ముద్రించడం కూడా ఎన్నికల కమిషన్‌కు సవాల్‌గా మారడంతో రెండు నెలలపాటు పోలింగ్‌ను వాయిదా వేశారు. ఎంఈఎస్ కార్యాధ్యక్షుడు రంజిత్ చౌహాన్ శనివారం సమావేశంలో మాట్లాడుతూ 700 మంది ఎంఈఎస్ సభ్యులు పాల్గొనేలా సమావేశానికి ఆహ్వానించామన్నారు. అందరి అభిప్రాయం ప్రకారం మరాఠాల ఓట్లు చీలకూడదని, సంయుక్తంగా ఒకే నిర్ణయంతో ముందుకెళ్లాలని తీర్మానించామన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎంఈఎస్ అభ్యర్థి బరిలో ఉంటారన్నారు. ఎవరో ఒకరిని పోటీ చేయించి, వారిని బలివ్వాలనే దురుద్దేశ్యం తమకు లేదన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు సహకరించేది లేదన్నారు. తమ సమస్య పరిష్కారమే భవిష్యత్తు లక్ష్యమన్నారు. 60 శాతం కన్నడలోనే బోర్డులు ఉండాలనే నిబంధనలు తమకు ఇబ్బంది కలిగించిందన్నారు. సరిహద్దు వివాదం సుప్రీంకోర్టులో పరిష్కారమయ్యేదాకా యథాస్థితిని కాపాడాలని డిమాండ్ చేశారు.





అమ్మవారి అలకతీర్చిన శ్రీవారు



అలుకోత్సవాన్ని నిర్వహిస్తున్న పండితులు



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు



ఆలయం వద్ద అలరించిన చిన్నారుల నృత్యాలు

ఆకట్టుకున్న శ్రీవారు, దేవేరుల సంవాదం... అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చిన ఖాద్రీశుడు

కదిరి, మార్చి 31: శ్రీసత్యసాయి జిల్లా ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగమైన అలుకోత్సవ ఆదివారం రాత్రి కదిరిలో కనులపండువగా సాగింది. ఆనవాయితీ ప్రకారం ఈ ఉత్సవాన్ని ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి నివాసం వద్ద నిర్వహించారు. కల్యాణోత్సవం నాటి నుంచి స్వామివారు రోజుకో వాహనంపై ఊరేగుతూ భక్తులను తప్ప.. తమను పట్టించుకోవడం లేదంటూ శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు అలక పాన్పు ఎక్కడం, వారిని శ్రీవారు అనుయించయించే ఘట్టాలే అలుకోత్సవం. అమ్మవార్ల తరఫున ఈఓ వకాల్తా పుచ్చుకోగా.. శ్రీవారు, అమ్మవార్ల మధ్య సంభాషణను ఆలయ అర్చకులు భక్తులకు వినిపించడం ఉత్సవం ప్రత్యేకత. సృష్టిలో సర్వమూ తానేననీ, లోక కల్యాణార్థమే తాను భక్తుల చెంతకు వెళ్తున్నానంటూ శ్రీవారు నచ్చజెప్పడంతో అమ్మవార్లు శాంతించి, యాగశాల ప్రవేశం గావించారు. ఈ ఉత్సవానికి ఆలయ ఈఓ దంపతులు ఉభయదారులుగా వ్యవహరించి, శ్రీవారు, అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించారు. పట్టణంలోని ప్రముఖులతో పాటు పెద్దఎత్తున భక్తులు ఈ ఉత్సవాన్ని వీక్షించారు. అలుకోత్సవం అనంతరం శ్రీవారు అశ్వవాహనంపై కొలువుదీరి మాడవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. పదిహేను రోజుల పాటు నిర్వహించిన బ్రహ్మోత్సవాలు విజయవంతమయ్యాయని చాటి చెప్పేందుకే శ్వేత అశ్వావాహనంపై స్వామివారు దర్శనమిచ్చారు.

నేడు 'తీర్థవాది'

శ్రీ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం తీర్థవాది నిర్వహించనున్నారు. ఉత్సవాలకు అంకురార్పణ చేసిన నాటి నుంచి యాగశాలలోనే కొలువుదీరిన శ్రీవారు సోమవారం ఆలయ ప్రవేశం చేయనున్నారు. నేటి ఉత్సవంలో భాగంగా ఉదయం నిత్యపూజ అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారు ఆలయప్రాంగణంలో కొలువుదీరుతారు. ఈ సందర్భంగా అధికారులు, ఉద్యోగులు, భక్తులు అన్న భేదం లేకుండా అందరూ రంగులు చల్లుకుని, వసంతోత్సవాలు చేసుకుంటారు. అనంతరం దేవేరుల సమేత శ్రీవారిని ఆలయానికి పడమర దిక్కున ఉన్న భృగుతీర్థం వరకు ఊరేగిస్తారు.వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ భృగుతీర్థంలో శ్రీచక్రస్నానం, అభిషేకాలు నిర్వహించిన అనంతరం తిరువీధుల గుండా ఆలయ ప్రవేశం గావిస్తారు. నారసింహుడిని ఇలవేల్పుగా కొలిచే భక్తులు తీర్థవాది రోజు శ్రీవారికి కానుకలు సమర్పించడం ఆనవాయితీ. ఇందుకోసమే వేలాదిమంది భక్తులు ఇక్కడికి తరలివస్తారు. శ్రీచక్రస్నానం అనంతరం శ్రీవారు ఆలయంలోకి ప్రవేశించిన వెంటనే ప్రధాన ద్వారాలు మూసివేసి, అన్నిరకాల దర్శనాలను రద్దు చేస్తారు. పునః దర్శనం మంగళవారం ఉదయమే.



ధర్మరాయ స్వామి దేవాలయం (ఫైల్)

కరగ ఉత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు

15 నుంచి 25 వరకు నిర్వహణ

బెంగళూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): నగరంలో చారిత్రాత్మకంగా జరిగే కరగ ఉత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఏప్రిల్ 15 నుంచి 25వరకు ధర్మరాయ స్వామి ఆలయంలో కరగ ఉత్సవాలు జరగనున్నాయి. కరగ ఉత్సవం కర్ణాటక ప్రసిద్ధ జానపద సంస్కృతిగా ఉంది. ఆదిశక్తి ద్రౌపదీదేవిని వహ్నికుల క్షత్రియ సామాజిక వర్గానికి చెందినవారు ఆరాధిస్తారు. శతాబ్దాలకాలంగా సముదాయానికి చెందినవారు ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా ఆచరిస్తున్నారు. ఇప్పటికే ధర్మరాయస్వామి ఆలయ కమిటీ కరగ ఉత్సవాలకు సంబంధించి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మరో వారంలో రెండో సమావేశం జరుగుతుందని ప్రకటించారు. ఈ సంవత్సరం కూడా అర్చకుడు జ్ఞానేంద్ర కరగను మోయనున్నారు. ఏప్రిల్ 15న రాత్రి శక్తిఉత్సవం ప్రారంభం కానుంది. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ఆలయంలో ప్రత్యేక పూజలు కొనసాగుతాయి. ఏప్రిల్ 20న మహిళలు దీపాలు మోసే కార్యక్రమం ఉంటుంది. 21న హసికరగ, 22న పొంగల్ సేవ, 23న చైత్రమాసం పౌర్ణమిన కరగ మహోత్సవం జరుగుతుంది. 24న గావ్ ఉత్సవం, 25న ధ్వజ అవరోహణతో ఉత్సవాలు ముగుస్తాయి. బృహత్ బెంగళూరు మహానగర పాలికె కమిషనర్ తుషార్ గిరినాథ్ ఆధ్వర్యంలో కరగ ఉత్సవాలపై సన్నాహక సమావేశం నిర్వహించారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నిబంధనలకు భంగం కలగకుండా ఉత్సవాలు జరపాలని కమిషనర్ సూచించారు. కరగ ఉత్సవం సాగే మార్గంలో రోడ్ల మరమ్మతులు చేపట్టదలిచారు. వీధి దీపాల నిర్వహణతోపాటు ఈ సంవత్సరం ప్రత్యేకంగా సీసీ కెమెరాలను అమరుస్తున్నారు. కరగ ఉత్సవాల వేళ ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నారు. నీటి కొరత దృష్ట్యా అదనపు ట్యాంకర్లను ఏర్పాటు చేస్తున్నట్లు ధర్మరాయస్వామి ఆలయ కమిటీ ఛైర్మన్ సతీశ్ తెలిపారు. ప్రజలకోసం పలు చోట్ల వాటర్ ఫిల్టర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

రైతు ఔదార్యం

జీవాల కోసం కాలువకు నీరు

ఆదర్శంగా నిలిచిన శివమొగ్గ రైతు



బోరు ద్వారా నది కాలువకు నీటి విడుదల

బెంగళూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రమంతటా కరువు విలయతాండవం చేస్తోంది. ఈ ఏడాది ఖరీఫ్ నుంచి సరైన వర్షాలు కురవకపోవడంతో భూగర్భజల మట్టం అడుగంటిపోయింది. ఉత్తర కర్ణాటకతోపాటు దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ తాగునీటి సమస్య తీవ్రమవుతోంది. మార్చి ప్రారంభం నుంచే రాష్ట్రమంతటా ఎండలు పెరిగిపోతున్నాయి. మూగ జీవాలు, పశుపక్ష్యాదులు దాహం కోసం అలమటించే పరిస్థితి నెలకొంది. మలెనాడు ప్రాంతంగా పిలవబడే శివమొగ్గ జిల్లా అంతటా దట్టమైన అడవులు, నదులు, సరస్సులు కల్గి ఉంది. అక్కడ కూడా నీటి వనరులు లేకపోవడంతో గ్రామానికి చెందిన పశువులు, పక్షులకోసం ఏకంగా ఓ రైతు సాగు చేసిన పంటలను వదిలేసి ఓ కాలువకు నీరు మళ్లించారు. హొసనగర తాలూకా అరసాళు గ్రామపంచాయతీ సూడూరు గ్రామానికి చెందిన రైతు మంజునాథభట్ ఆదర్శాన్ని రాష్ట్రమంతటా కొనియాడుతున్నారు. బోరుబావి ద్వారా ఏడు ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. పశువులకు నీటి సమస్యను జీర్ణించుకోలేని ఆయన బోరుబావి నుంచి నేరుగా కుముద్వతి నదికి నీటిని వదిలారు. విద్యుత్ సక్రమంగా లేకపోవడంతో డీజిల్ ఇంజిన్ మోటర్ ద్వారా నీటిని నదికి మళ్లించారు. ప్రస్తుతం నది కాలువలో పుష్కలంగా నీరు నిల్వ ఉంది. రైతు మంజునాథభట్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లగా చూస్తున్నానని, కుముద్వతి నదిలో ఎండాకాలంలోనూ నీరు ఉండేదన్నారు. ఈ ఏడాది నీరు ప్రవహించకపోవడంతో ఎండిపోయిందని తెలిపారు. నదీ పరీవాహకంతోపాటు ఈ ప్రాంతానికి చెందిన వన్యప్రాణులు, పక్షులు గ్రామస్థులు పెంచుకునే పశుసంపదకు నీటి సమస్య ఉన్నందునే బోరు నీటిని కాలువకు వదిలానని పేర్కొన్నారు. పది రోజులుగా పశువులు, పక్షులు దాహం తీర్చుకోవడం చూస్తుంటే సంతోషంగా ఉందన్నారు. సాగు చేసిన పంట ఎండిపోతోందనే బాధ ఉందని, కానీ ప్రాణం కాపాడుకునేందుకు పశువుల పడుతున్న సమస్య తీరిందనే సంతోషం ఉందన్నారు.

మోదీపై అభిమానాన్ని


ఓటుగా మార్చాలి

కార్యకర్తలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర పిలుపు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర తదితరులు

బెంగళూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై ప్రజలు ప్రత్యేక అభిమానంతో ఉన్నారని, దానిని ఓటుగా మార్చాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర పిలుపునిచ్చారు. బెంగళూరు పార్టీ కార్యాలయంలో ఆదివారం పార్టీ రాష్ట్ర ఎన్నికల విభాగం, న్యాయ విభాగానికి చెందిన ముఖ్యులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విజయేంద్ర మాట్లాడుతూ కాంగ్రెస్ చేసే తప్పిదాలపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం, కేసులు దాఖలు చేయించడంపై నిరంతరంగా పర్యవేక్షించాలన్నారు. ప్రత్యర్థుల తప్పిదాలను ఎప్పటికప్పుడు గుర్తించకపోతే వారి ఆగడాలు ఇతరత్రా కలాపాలు దారి తప్పుతాయన్నారు. నోరు జారి మాట్లాడితే కేసులతోనే సమాధానం చెప్పాలని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆందోళనలో పడిందని, 9నెలల క్రితం అధికారంలోకి వచ్చి అన్నింటా విఫలం చెందిందని అన్నారు. ముఖ్యమంత్రి ఎక్కువ స్థానాలు విజయం సాధించేందుకు 10-15 మంది మంత్రులకు టిక్కెట్లు ఇవ్వాలని భావించారని, ఎవరూ ముందుకు రాకపోవడంతో వారి పిల్లలు, కుటుంబ సభ్యులకు కట్టబెట్టారన్నారు. దీన్నిబట్టి వారు ఎన్నికల కోసం ఎటువంటి ప్రణాళికలతో ముందుకెళ్లలేదని తెలుస్తోందన్నారు. పార్టీ ఎన్నికల విభాగం గ్రామస్థాయి నుంచి నిరంతరంగా పర్యవేక్షించాలన్నారు. ప్రధాని నరేంద్రమోదీ పట్ల ప్రజలు విశ్వాసంతో ఉన్నారని, పదేళ్లలో చారిత్రాత్మక విధానాలు తీసుకొచ్చారనే నమ్మకం చూపుతున్నారన్నారు. గెలుపొందే భ్రమలో కాంగ్రెస్ ఉందని, 28 నియోజకవర్గాల్లోనూ విజయం దిశగా పోరాటం చేద్దామన్నారు. లీగల్‌సెల్ రాష్ట్ర సంచాలకుడు వసంతకుమార్, ఎన్నికల నిర్వహణా సమితి సంచాలకులు అనిల్‌కుమార్, లక్ష్మణ్, దత్తగుడి హెగ్డే, రాజశేఖర్, వినోద్ కుమార్, హర్ష ముతాలిక్ తదితరులు పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,580.67	1,586.11
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	975	5,818
సామర్థ్యం (టీఎంసీలు)	4.81	8.07

ఏళుపడగల నాగప్పకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో బుక్కసాగర ఏళుపడగల నాగప్ప

కంప్లి, మార్చి 31 : విజయనగర జిల్లాలోని బుక్కసాగర వద్ద ఏళుపడగల నాగప్ప దేవస్థానంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. షష్టిఆదివారం కలిసిరావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ పూజలు చేపట్టారు. ఉభయ జిల్లాల నుంచి భక్తులు భారీ ఎత్తున పాల్గొని స్వామివారికి మొక్కులు సమర్పించుకున్నారు. అనేక మంది పూజల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. పుష్పాలతో ప్రత్యేకాలంకరణ చేపట్టి అర్చకులు పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి సీపీఎం మద్దతు: ప్రతాప్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

బళ్లారి సిటీ,మార్చి 31: రానున్న జూన్ నెలలో జరిగే ఈశాన్య పట్టభద్రుల నియోజకవర్గం నుంచి జరిగే ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని నారా ప్రతాప్‌రెడ్డి అన్నారు. తనకు సీపీఎం మద్దతు ప్రకటించిందని తెలిపారు. నగరంలోని తన కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2018లో తాను ఈశాన్య గ్రాడ్యుయేట్ నియోజకవర్గం నుంచి పోటీ చేశానని, మొదటి ప్రాధాన్యత ఓట్లు ఎక్కువగా ఉన్నప్పటికీ, తిరస్కరణకు గురైన వేలాది ఓట్లతో తాను ఓటిపోయానన్నారు. అయిప్పటికీ తాను ఈ రంగంలో గ్రాడ్యుయేట్, విద్యా, సామాజిక సంస్థలతో నిరంతరం సన్నిహితంగా ఉంటున్నానని పేర్కొన్నారు. గెస్ట్ టీచర్ల జీతభత్యాలు, ఉద్యోగ భద్రతపై పోరాటం చేస్తామన్నారు. విలేకరుల సమావేశంలో సీపీఎం నాయకుడు గురుశాంత మాట్లాడుతూ కళ్యాణ్ కర్ణాటక నుంచి ఎన్నికైన ఎమ్మెల్సీలు ఇప్పటి వరకు ఏం చేశారనే ప్రశ్న ఎప్పటి నుంచో ఉందన్నారు. స్థానికులకు ఉపాధి కల్పించే సమస్యలపై ప్రతాప్‌రెడ్డి తన స్వరం పెంచగలిగారని, ప్రతాప్‌రెడ్డి పనితీరు చూసిన తర్వాత ఆయనకు మద్దతు ఇవ్వాలని పార్టీ నిర్ణయించిందన్నారు. ఉమ్మడిగా ప్రచారం చేయడమే కాకుండా కార్మిక సంఘాలలో ఉన్న పట్టభద్రుల ఓట్లను రాబట్టేందుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు సత్యబాబు, చంద్రకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉచ్చీరప్ప తాతకు ప్రత్యేక పూజలు

సిరుగుప్ప, మార్చి 31: పట్టణంలోని 24వ వార్డులో వెలసిన ఉచ్చీరప్ప తాతకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాత వారికి ధూపదీప నైవేద్యాలతో పూజలు జరిపి మహా మంగళహారతి సమర్పించారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు.



ప్రత్యేక అలంకరణలో ఉచ్చీరప్ప తాత

బళ్లారి భగభగ

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- ఆందోళనలో ప్రజలు



నిర్మానుష్యంగా మారినఎస్పీ సర్కిల్



మిట్టమధ్యాహ్నం వేళ ఖాళీగా దర్శనమిస్తున్న నగరంలోని ఓ రోడ్డు

బళ్లారి సిటీ, బళ్లారిరూరల్, మార్చి 31: బళ్లారి నగరంలో ఆదివారం ఎండలు అధికంకావడంతో నగరవీధులు నిర్మానుష్యంగా మారాయి. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఆదివారం ఉష్ణోగ్రత 40 డిగ్రీలు దాటడంతో నగరవాసులు ఇళ్ల నుంచి బయటకు రాలేకపోయారు. దీంతో నగరవీధులన్నీ నిర్మానుష్యంగా మారాయి. ముఖ్యంగా ఎస్పీ సర్కిల్, వాల్మీకి సర్కిల్, ఇన్‌ఫాంట్ రోడ్డు తదితర ప్రాంతాలు జనసంచారంలేక బోసిపోయాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరగడంతోపాటు వేడి గాలులు వీస్తున్నాయి. ప్రజలు షర్బత్, మజ్జిగ లాంటి చల్లని పానీయాల కోసం ఆరాటపడుతున్నారు. ఎండ వేడికి ప్రజలు ఇబ్బందులు పడుతూ ఫ్యాన్లు, ఏసీలను ఆశ్రయిస్తున్నారు. విద్యుత్ సరఫరా నిలిచిపోతే ఇంట్లో కూర్చోగలిగే పరిస్థితి కనిపించడంలేదు. గత రెండేళ్లుగా మార్చి నెలలో ఎండల తీవ్రత అంతగా లేకపోయినప్పటికీ ఈ ఏడాది ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి: తుకారామ్

కంప్లి, మార్చి 31: దేశంలో కాంగ్రెస్‌పార్టీ వల్లే అభివృద్ధి జరుగుతుందని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఈ తుకారామ్ తెలిపారు. ఆయన ఆదివారం కొత్త దరోజీ, పాత దరోజీ, మాదాపురం, ఏళుబెంచి, కుడితిని, వేణి వీరాపురం గ్రామాలలో జోరుగా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అప్పట్లో సోనియా గాంధీ పోటీ చేసిన బళ్లారి క్షేత్రంలో తాము కూడా అభ్యర్థిగా పోటీ చేయడం సంతోషించదగ్గ విషయమన్నారు. అప్పట్లో కేపీసీఎల్, జేఎస్‌డబ్ల్యూ, విశ్వవిద్యాలయం, నిర్మించారని అప్పటి నుంచి బళ్లారి విజయనగర జిల్లాల్లో ఎంతోమంది వాటిపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారు. బీజేపీ హయాంలో శ్రీరాములు, దేవేంద్రప్ప కేవలం పేరుకు మాత్రమే ఎంపీలయ్యారని, అభివృద్ధి మాత్రం శూన్యమన్నారు. మన్మోహన్‌సింగ్ ప్రధానిగా వున్న సమయంలో ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. లక్షల కోట్లల్లో దేశం అప్పులపాలైందన్నారు. కేవలం అయోధ్య రామ దేవాలయం పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. తమ రాష్ట్ర ప్రభుత్వం సిద్దరామయ్య, డీకే శివకుమార్ ఆధ్వర్యంలో కొనసాగుతోందన్నారు. గ్యారెంటీ పథకాలు విద్యార్థులకు, మహిళలకు ఇతరులకు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. మున్ముందు కూడా జిల్లా ప్రజలు తమకు అవకాశం కల్పించినట్లయితే పూర్తిగా అభివృద్ధి చేపట్టి ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దుతామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామీణ విభాగం అధ్యక్షులు శివయోగి, ఏకాంబరం, రాజశేఖర్, జనార్దన్, గురుమూర్తి, ఈసన్న, ప్రభు, అంజి, చంద్రన్న, గంగాధర్, లెనిన్, సునిల్, గ్రామ పంచాయతీ, పట్టణ పంచాయతీ సభ్యులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కుడితినిలో ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్ అభ్యర్థి తుకారామ్

పొత్తుధర్మాన్ని పాటించాలి / బీజేపీ-జేడీఎస్ సమన్వయ సభలో వెంకటరావ్ నాడగౌడ

బళ్లారి సిటీ, మార్చి 31: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, జేడియస్ పొత్తు కుదుర్చుకున్నాయని 28 నియోజకవర్గాల్లో అభ్యర్థుల గెలుపునకు అందరూ కలిసి శ్రమించాలని మాజీ మంత్రి జేడియస్ ప్రముఖుడు వెంకటరావ్ నాడగౌడ అన్నారు. నగరంలోని సూర్యభవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన బీజేపీ-జేడియస్ సమన్వయ సభలో ఆయన మాట్లాడారు. మాజీ ప్రధానమంత్రి దేవేగౌడ దేశానికి మోదీ అవసరం ఉందన్నారని, బీజేపీలో మోదీకి సమానంగా కాంగ్రెస్‌లో ఎవరూ లేరన్నారు. కాంగ్రెస్ గ్యారెంటీ పథకాలతో దేశ అభివృద్ధి కుంటుపడిందన్నారు. కావున దేశ ఆర్థిక సుభద్రతకు బీజేపీ అభ్యర్థిని గెలిపించాలన్నారు. బళ్లారి బీజేపీ అభ్యర్థి శ్రీరాములు మాట్లాడుతూ బీజేపీ ,జేడియస్ 2006లో కలిసి పని చేశాయని కాని కాంగ్రెస్ తమ మైత్రిని విడగొట్టడానికి కుతంత్రాలు చేస్తోందన్నారు. జేడియస్, బీజేపీ ఒక్కటి కావడంతో కాంగ్రెస్‌కు టెన్షన్ ప్రారంభమైందన్నారు. ఈ ఎన్నికల్లో రాష్ట్రంలోని 28 నియోజకవర్గాల్లో గెలుపు సాధిస్తామన్నారు. ఈసమారంభంలో ఎమ్మెల్యే నేమిరాజు నాయక్, మాజి ఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డి, విధాన పరిషత్ సభ్యులు సతీశ్, సోమలింగప్ప, రాజా వెంకటప్పనాయక్, హర్షవర్దన, ఓబలేశ్, మీనళ్ళితాయణ్ణ, లక్షికాంత్‌రెడ్డి, బాదామి గంగప్ప, కొట్రేశ్, బసవరాజు, జేడియస్ యువ ప్రముఖులు కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



సమన్వయ సభను ప్రారంభిస్తున్న వెంకటరావ్ నాడగౌడ, శ్రీరాములు తదితరులు

కేజ్రీవాల్ అరెస్టుకు వ్యతిరేకంగా ఇండియా కూటమి ధర్నా

బళ్లారి సిటీ, మార్చి 31: ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ పార్టీ ప్రముఖుడు కేజ్రీవాల్‌ను ఎక్సైజ్ కేసులో అరెస్టుచేయడాన్ని వ్యతిరేకిస్తూ ఇండియా మైత్రికూటమి ఆదివారం ధర్నా చేసింది. విమ్స్ మైదానం లోని మహాత్మాగాంధీ విగ్రహం వద్దకు చేరుకున్న ఇండియా మైత్రికూటమి ప్రముఖులు ఆదివారం ఈ ధర్నా నిర్వహించారు.

ఈసందర్భంగా అమ్ ఆద్మీపార్టీ ప్రముఖులు కొర్లగుంది పెద్ద కేశవరెడ్డి, మంజునాథ్ మాట్లాడుతూ ఎన్నికల ముందు బీజేపీ కుంభకోణాలు ఎక్కడ బయటపెడతాడో అని ముందస్తుగా కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం సమంజసం కాదన్నారు. ఈసందర్భంగా కాంగ్రెస్ ప్రముఖులు కల్లుకంబ పంపాపతి, పాలికె సభ్యులు గాదెప్ప, బుడా మాజి అధ్యక్షులు నారా ప్రతాప్‌రెడ్డి అల్లం ప్రశాంత్, బోయపాటి విష్ణువర్దన్, సీపీఎం గురుశాంత్, సత్యబాబు, గంగిరెడ్డి, చంద్రకుమారి తదితరులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న ఇండియా కూటమి నేతలు

ఓటింగ్ శాతం పెరగడానికి బీఎల్‌ఓలు కృషి చేయాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న నోడల్ అధికారి రాహుల్ శరణప్ప

బళ్లారి సిటీ, మార్చి 31: ఓటింగ్ శాతాన్ని గణనీయంగా పెంచడంలో బూత్‌లెవల్ అధికారుల పాత్ర ఎంతో ఉందని జిల్లా స్వీప్ కమిటీ నోడల్ అధికారి రాహుల్ శరణప్ప అన్నారు. సండూరు పట్టణంలోని ఏపీఎంసీ ఉన్న పాఠశాల ఆవరణలో జిల్లా ఎన్నికల అధికారి, స్వీప్ కమిటీ ఆధ్వర్యంలో బూత్ లెవల్ ఆఫీసర్లయిన ఉపాధ్యాయుల కోసం 'శిక్షణ వర్క్‌షాప్'ను ప్రారంభించి మాట్లాడారు. పోలింగ్ బూత్‌ల వద్ద ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి ఓటింగ్ శాతాన్ని గణనీయంగా పెంచేందుకు తమ వంతు సహకారం అందించాలన్నారు. జిల్లాస్వీప్ కమిటీ నుంచి ఎన్నికల తేది వరకు పలు రకాలుగా ఓటింగ్ అవగాహన కార్యక్రమం నిర్వహించి ఓటర్లకు అవగాహన కల్పించాలని, పోలింగ్‌బూత్‌కు వచ్చి ఓటు వేసేలా ఓటర్లను ప్రోత్సహించాలన్నారు. సండూరు తాలూకా స్వీప్ కమిటీ నోడల్ అధికారి షడక్షరయ్య మాట్లాడుతూ ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో పజల్లో ఓటింగ్‌పై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. తాహసీల్దార్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ అర్హులైన ఓటర్లు ఓటు వేసేలా బిఎల్‌ఓలు ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రత్యేక బాధ్యతతో వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో క్షేత్ర విద్యాధికారి ఐఆర్, అక్కి, తాలూకా డీఎల్‌ఎంటీ సభ్యులు టీఎల్‌ఎంటీ, ఈఎల్‌సీ బీఎల్‌ఓలు, 253 పోలింగ్ కేంద్రాల సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

గాంధీ సర్కిల్‌లో వీధి లైట్ల ఏర్పాటుకు డిమాండ్



గాంధీ సర్కిల్‌లో లైటులేని విద్యుత్ స్తంభం

సిరుగుప్ప, మార్చి 31 : గాంధీ సర్కిల్‌లో వీధి లైట్లు లేకపోవడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిరుగుప్ప పట్టణం నగరసభ పరిధిలోకి రానున్నప్పటికీ పట్టణ నడిబొడ్డున గాంధీ సర్కిల్‌లో వీధిలైట్లు లేకపోతే ఊరి చివరన, మురుగువాడల పరిస్థితి ఎలా వుంటుందోనని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై నగరసభ అధికారులకు కాలనీవాసులు అనేకమార్లు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా నగరసభ అధికారులు స్పందించి గాంధీ సర్కిల్‌లో వీధి లైట్లు అమర్చాలని ప్రజలు కోరుతున్నారు.

బూడిద కొండను పర్యాటక కేంద్రంగా మార్చాలి



కొండపై ఆకట్టుకుంటున్న బసవన్న

కంప్లి, మార్చి 31 : కుడితిని, తోరణగల్లు మధ్య కేపీసీఎల్ ఎదురుగా వుండే బూడిద కొండను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని సాంఘికసేవా సంస్థ నేతలు కోరారు. గత కొంతకాలంగా ఈ కొండ పర్యాటక కేంద్రంగా పేరుపొందింది. వర్షాకాలంలో రోడ్డుపై వెళ్లే ప్రయాణికులు ఈ ప్రదేశాన్ని చూసి ఆనందాన్ని వ్యక్తపరుస్తున్నారు. ఆ ప్రాంతంలో పర్యాటకులను ఆకట్టుకునే విధంగా విద్యుత్ లైట్లు, శౌచాలయాలు, కంచె ఏర్పాటు చేసి హంపీలాగా తీర్చిదిద్దాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికే ఇక్కడ రూ. 15 లక్షల వ్యయంతో బసవన్నల విగ్రహాలు సిద్ధం చేశారు. అలాగే మున్ముందు కూడా పర్యాటక శాఖ ముందుకొచ్చి అభివృద్ధి పనులు జరపాలని జంగ్లిసాబ్, సంపత్‌కుమార్, కామేష్, తిమ్మప్ప, భావి శివకుమార్ తదితరులు కోరారు.

కంప్లికి పొంచివున్న నీటిగండం

నీటి సరఫరాకు ప్రత్యేక చెరువు ఏర్పాటు చేయాలని డిమాండ్



బిందెలతో నీటిని తీసుకెళుతున్న ప్రజలు

కంప్లి, మార్చి 31 : కంప్లి పట్టణంలోని 23 వార్డుల ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా చూడాలని కరవే అధ్యక్షుడు, షుగర్ ఫ్యాక్టరీ రవిశేఖర్ తెలిపారు. ఇప్పటికే విజయనగర జిల్లాలోని పలు గ్రామాలు నీటి సమస్యతో సతమతమవుతున్నాయని, అలాంటి పరిస్థితి కంప్లికి రాకముందే అధికారులు, పట్టణానికి ప్రత్యేకంగా చెరువు ఏర్పాటు చేయాలని కోరారు. నదిలో నీరు ప్రవహించే సమయంలో చెరువును పూర్తిగా నీటితో నింపి వేసవిలో నీటిసమస్య తలెత్తకుండా చూడాలన్నారు. కాని అధికారులు స్మశానానికి పక్కనే నది వుందనే నెపంతో ముందు జాగ్రత్త లేకుండా నదిలో నీటిని పంపుసెట్ల ద్వారా ట్యాంకుకు మళ్లించి ట్యాంకు నుంచి వార్డుల్లోకి నీటిని అందిస్తున్నారు. సూగూరు, మన్నూరు, సన్నాపురం ప్రాంతాల్లో నది పూర్తిగా అడుగంటిపోయింది. కానీ ఇక్కడ కూడా అదే పరిస్థితి ఏర్పడితే ప్రజలకు ఎటువెళ్లాలో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికే నదిలో కంప్లికోటెవద్ద నీటిప్రవాహం తగ్గిపోయింది. ఇప్పటికైనా అధికారులు చెరువు ఏర్పాటుచేసి నీటిసమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

హోసూరు జోన్

చర్చిలలో ఈస్టర్ వేడుకలు



చర్చిలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు

హోసూరు, మార్చి 31: ఈస్టర్‌ను పురస్కరించుకుని పలు చర్చిలలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. హోసూరు కార్పొరేషన్ పరిధిలోని మత్తిగిరిలో ఆరోగ్యమాత చర్చిలో ఈస్టర్ ప్రార్థనలు చేశారు. మత్తిగిరిలో గుడ్‌ఫ్రైడే, తర్వాత వచ్చే ఈస్టర్ జరుపుకున్నారు. చర్చిని వివిధ పూల అలంకరణతో అలంకరించారు. ధర్మపురి జిల్లా హోసూరు ప్రధాన పాస్టర్ క్రిస్టోఫర్ కొవ్వొత్తి వెలిగించి ప్రత్యేకంగా ప్రార్థనలు నిర్వహించారు. శుభాకాంక్షలు తెలిపారు.

ఐటీ దాడుల్లో భారీగా నగదు, నగల స్వాధీనం

హోసూరు(క్రైం), మార్చి 31: లోక్‌సభ ఎన్నికల వేళ సరైన రికార్డులు లేని రూ.1.20 కోట్ల నగదు, 800 గ్రాముల బంగారం నగలు స్వాధీనం చేసుకున్నారు. హోసూరు పాత బస్టాండ్ సమీపంలోని సీతారాంనగర్ జలకంఠేశ్వర నగర్ ప్రాంతంలో లోకేశ్‌కుమార్ అనే వ్యక్తి క్రషర్ నిర్వహిస్తున్నాడు. మార్చి 28న లోకేశ్ కుమార్ బెంగళూరు నుంచి హోసూరుకు కారులో బయలుదేరాడు. ఎన్నికల స్క్వాడ్ అధికారులు తనిఖీ చేసి అతడి వద్ద రూ.10 లక్షలు ఉన్నట్లు గుర్తించారు. అతనివద్ద ఎటువంటి రికార్డులు లేకపోవడంతో నగదును సబ్‌కలెక్టర్ కలెక్టర్ ప్రియాంకకు అప్పగించారు. మరోకేసులో ఆదాయపు పన్ను శాఖ డిప్యూటీ కమిషనర్ విష్ణుప్రసాద్ ఆదివారం తెల్లవారుజామున ఓ వాహనంలో సోదాలు నిర్వహించి 800 గ్రాముల బంగారు నగలు, రూ.1 కోటి 20 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడి మృతి

హోసూరు(క్రైం) మార్చి 31: హోసూరు తాలూకా తొరపల్లి అగ్రహారానికి చెందిన ఓ కార్మికుడు రోడ్డుప్రమాదంలో మృతి చెందాడు. గోవిందప్ప(62) అనే ఈ కార్మికుడు శనివారం రాత్రి హోసూరు రాయకోటై రోడ్డులో భైరమంగళం జంక్షన్ వైపు నడుచుకుంటూ వెళ్తుండగా ఆర్టీసీ బస్సు అతడిని ఢీ కొట్టింది. అతడు గాయపడి అక్కడకక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై హోసూరు టౌన్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ప్రశాంత ఎన్నికలకు అందరూ సహకరించాలి: డీసీ

హోసూరు(కృష్ణగిరి), మార్చి 31: ప్రశాంత ఎన్నికలకు అందరూ సహకరించాలని కృష్ణగిరి జిల్లా ఎన్నికల అధికారి అయిన కలెక్టర్ సరయు విజ్ఞప్తి చేశారు. లోక్‌సభ ఎన్నికల బరిలో బరిలో నిలిచిన 27మంది అభ్యర్థులతో ఆదివారం ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ర్యాలీల వేళ ఇతర పార్టీల దిష్టిబొమ్మలను దహనం చేయరాదని, కులమత భావాలను రెచ్చగొట్టేలా ప్రసంగాలు చేయరాదన్నారు. మత పరమైన ప్రార్థనా ప్రదేశాలలో ప్రచారం చేయరాదన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టేలా నగదు, బహుమతులు ఇవ్వరాదన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా సజావుగా కొనసాగేందుకు అందరూ సహకరించాలన్నారు. సమావేశంలో వివిధ పార్టీల అబ్జర్వర్‌లు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ కెఎం సరయు

కేజ్రీవాల్ విడుదలకు రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలి



డీసీ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న ఆప్ నాయకులు

రాయచూరు, మార్చి 31: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను విడుదల చేయించేందుకు రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలని ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు కోరారు. కేజ్రీవాల్ అరెస్టును నిరశిస్తూ ఆదివారం జిల్లాకు చెందిన ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు జిల్లాధికారి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు, రాజకీయ ప్రత్యర్థులను వేధించేందుకు ప్రదాని నరేంద్ర మోదీ రాజ్యాంగ సంస్థలను వినియోగిస్తుండడం దౌర్భాగ్యమన్నారు. ఇప్పటికే సీబీఐ, ఈడీ, ఇన్‌కమ్‌ట్యాక్స్ వంటి స్వతంత్ర ప్రతిపత్తిగల సంస్థల సహాయంతో రాజకీయంగా భవిష్యత్తులో తనకు ప్రమాదం అని అంచనా వేసుకున్న ప్రతి నాయకుడిని అరెస్టు చేయించడాన్ని ప్రధాని నరేంద్ర మోదీ పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. మద్యం కుంభకోణం కేసులో ఇప్పటికే ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీష్, సత్యేంద్ర జైన్‌లను అరెస్టు చేసినప్పటికీ వారు అవినీతికి పాల్పడినట్లు ఏ ఒక్క ఆధారాన్ని చూపించలేకపోయారన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీపార్టీని అడ్డుకునే కుటిల యత్నంతోనే కేజ్రీవాల్ అరెస్టు జరిగిందని ఈ విషయంలో రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలని కోరారు.

గుండెపోటుతో శ్రీశైలానికి వెళ్లే యాత్రికుడి మృతి

రాయచూరు, మార్చి 31: శ్రీశైలానికి పాదయాత్రగా బయలుదేరిన భక్తుడొకరు జిల్లాలోని మాన్వి తాలూకాలో గుండెపోటుతో మృతి చెందారు. బాగలకోట నుంచి నాల్గు రోజులక్రితం బయలుదేరిన అతడు ఆదివారం మధ్యాహ్నం వరకు మాన్వి తాలూకాలోని చిక్కకోట్నేకల్ గ్రామానికి చేరుకున్నాడు. అప్పటికే కొంత నీరసంగా ఉన్న ఆ యువకుడు అక్కడే విశ్రమించాడు. అనంతరం కొద్దిసేపటికే గుండెపోటురాగా అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. మృతుడిని బాగలకోట జిల్లాకు చెందిన రబకవి బనమట్టి గ్రామానికి చెందిన శ్రీశైల దడుతి(24)గా గుర్తించారు.మాన్వి పోలీసులు సమాచారాన్ని కుటుంబసభ్యులకు చేరవేసి మృతదేహాన్ని మాన్వి తాలూకా ఆస్పత్రిలో భద్రపరిచారు.



శ్రీశైల దడుతి మృతదేహం

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

ఒటోవాన్ బిస్మార్క్ (జయంతి)




ఒటో ఎడువార్డ్ లియోపాడ్ వాన్ బిస్మార్క్ 1815 ఏప్రిల్ 1న జన్మించారు. 1860-1890 మధ్య జర్మనీ, యూరప్ రాజ కీయాల్లో ఆధిపత్యం వహించిన సంప్రదాయ రష్యన్ రాజనీతి వేత్త. 1871-1890 వరకు జర్మన్ సామ్రాజ్య తొలి చాన్స్‌లర్‌గా వ్యవహరించారు. 1862లో ప్రష్యన్ రాజు విల్‌హెల్మ్ 1 ప్రష్యా మినిస్టర్ ప్రెసిడెంట్‌గా బిస్మార్క్‌ను నియమించారు. ఆ పదవిలో 1873లో కొద్దికాలం విరామాన్ని మినహాయించి 1890 వరకు కొనసాగారు. యూరప్‌లో జర్మన్ సామ్రాజ్యం బలోపేతానికి కృషి చేశారు. 1898 జూలై 30న కన్నుమూశారు.

కోడి రామమూర్తి (జయంతి)




కోడి రామమూర్తినాయుడు 1882 ఏప్రిల్ 1న శ్రీకాకుళం జిల్లా వీరఘట్టంలో జన్మించారు. ప్రముఖ వస్తాదు, మల్ల యోధుడు. 20వ శతాబ్దపు తొలి దశకాలలో తెలుగువారిలో పేరొందిన మల్లయోధుడు. 21ఏళ్లకే ఛాతీపై ఒకటిన్నర టన్నులు, ఆపై 3 టన్నుల భారాన్ని మోశారు. రామమూర్తి సర్కస్‌సంస్థ పలుచోట్ల ప్రదర్శనలిచ్చి మంచి పేరు పొందింది. 1600 మంది గల తన బృందంతో లండన్‌కు వెళ్ళి ప్రదర్శనలివ్వగా అప్పటి ఇంగ్లండ్ పాలకులైన కింగ్‌జార్జ్, క్వీన్ మేరీలు 'ఇండియన్ హెర్క్యులెస్' బిరుదుతో సత్కరించారు. కలియుగ భీమ, మల్ల మార్తాండ తదితర బిరుదులు సొంతం చేసుకున్నారు. 1942 జనవరి 16న కన్నుమూశారు.

కేబీ హెగ్డేవార్ (జయంతి)



కేశవ్ బలీరాం హెగ్డేవార్ 1889 ఏప్రిల్ 1న నాగ్‌పూర్‌లో తెలుగు మాట్లాడే కుటుంబంలో జన్మించారు. దేశభక్తిని ప్రబోధించే హిందుత్వ భావనను వ్యాప్తి చేసేందుకు 1925లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)ను స్థాపించారు. స్వామి వివేకానంద, అరబిందో వంటి హిందూ సామాజిక, ఆధ్యాత్మిక సంస్కర్తల ప్రభావానికిలోనై మౌలిక భావజాలాన్ని నిర్మించారు. కాలక్రమంలో దేశవ్యాప్తంగా ఆర్ఎస్ఎస్ విస్తృతమైంది. 1940 జూన్ 21న కన్నుమూశారు.

అజిత్ వాడేకర్ (జయంతి)



'పద్మశ్రీ' గ్రహీత అజిత్ లక్ష్మణ్ వాడేకర్ 1941 ఏప్రిల్ 1న బాంబేలో జన్మించారు. 1966 నుంచి 1974వరకు క్రికెట్‌లో దేశం తరపున పలుమార్లు ప్రాతినిధ్యం వహించారు. క్రికెట్‌లో అంతర్జాతీయస్థాయిలో పేరొందారు. 1971లో దేశ క్రికెట్ జట్టుకు కేప్టెన్‌గా వ్యవ హరించారు. ఫిజికల్లీ చాలెంజ్‌డ్ వారికోసం ప్రత్యేకంగా ఇండియన్ క్రికెట్ జట్టుకు శ్రీకారం చుట్టారు. అర్జున అవార్డు, పద్మశ్రీ, సీకే నాయుడు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు ఇతర గౌరవాలు అందుకున్నారు. 2018 ఆగస్టు 15న కన్నుమూయగా రాష్ట్ర గౌరవాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

కాంగ్రెస్ ప్రచారానికి 40 మంది స్టార్ క్యాంపైనర్లు

బెంగళూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం కాంగ్రెస్ పార్టీ 40మంది స్టార్ క్యాంపైనర్ల జాబితాను ప్రకటించింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో కలిపి 40 మంది జాబితాను రాష్ట్ర ఎన్నికల అధికారికి ఆదివారం పంపారు. జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలా, మాజీ సీఎం వీరప్పమొయిలీ, కేంద్ర మాజీ మంత్రి జయరాం రమేశ్‌ను అత్యున్నత స్టార్ క్యాంపైనర్లుగా ప్రకటించారు. మిగిలిన వారిలో లక్ష్మణసవది, నేషనల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీవీ శ్రీనివాస్, వినయ్‌కుమార్ సొరకె, బీకే హరిప్రసాద్, ఆర్‌వీ దేశ్‌పాండె, మంత్రులు పరమేశ్వర్, హెచ్‌కే పాటిల్, ఎంబీ పాటిల్, దినేశ్ గుండూరావు, కృష్ణభైరేగౌడ, మాజీ మంత్రులు హెచ్‌ఎం రేవణ్ణ, వీజీఆర్ సింధ్యా, సోమశేఖర్, కేపీసీసీ ఉపాధ్యక్షుడు హనుమంతయ్య, రాజ్యసభ సభ్యుడు చంద్రశేఖర్, సయ్యద్ నాసిర్ హుసేన్ తదితరులు ఉన్నారు. కాగా మంత్రుల్లో జమీర్ అహ్మద్‌ఖాన్, మధుబంగారప్ప, ఈశ్వర్‌ఖండ్రె, సతీశ్‌జార్కిహోళి, మాజీ ఎంపీ ఉగ్రప్ప, పరమేశ్వరనాయక, పుష్పాఅమరనాథ్, తన్వీర్‌సేట్ ఉన్నారు.

ఘనంగా ఎల్లమ్మ దేవత మండల పూజ



ప్రత్యేక అలంకరణలో రేణుకా ఎల్లమ్మ మూలవిరాట్

గోరంట్ల, మార్చి 31: పట్టణంలోని రేణుకా యల్లమ్మ ఆలయంలో మండల పూజ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈడిగ గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ జరిపి 48రోజులు పూర్తికావడంతో అర్చకులు నాగేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత, మాజీ సర్పంచ్ నిమ్మల చంద్రశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరై పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కార్ల ర్యాలీతో ఓటుపై చైతన్యం



విధానసౌధ వద్ద వింటేజ్ కార్లు



బైక్ ర్యాలీలో బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్

బెంగళూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు బీబీఎంపీ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఆదివారం విధానసౌధ వద్ద వింటేజ్‌కార్లు, బైక్ ర్యాలీకి బెంగళూరు నగర జిల్లా ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్ పచ్చజెండా చూపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 26న జరిగే పోలింగ్‌లో ప్రజలంతా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరుతున్నట్లు తెలిపారు. వివిధ కార్యక్రమాల ద్వారా ఇప్పటికే అవగాహన కల్పించామన్నారు. నగరాల్లో ఆశించిన మేరకు పోలింగ్ శాతం నమోదు కాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే యువత మరింత చురుగ్గా పాల్గొనాల్సి ఉందని, ఓటింగ్‌శాతం పెరగాలని ఆకాంక్షించారు. బూత్‌స్థాయినుంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అక్కడ పాల్గొన్నవారిచే ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేయించారు. విధానసౌధ గ్రాండ్ స్టెప్స్ నుంచి ఇన్‌ఫ్రాంట్రీ రోడ్డు, ఎంజీ రోడ్డు, చిన్నస్వామి స్టేడియం మీదుగా, రెసిడెన్సీ రోడ్డు నుంచి కంఠీరవ స్టేడియం వరకు చేరుకుని ర్యాలీ ముగిసింది. కార్యక్రమంలో ఎన్నికల విభాగం ప్రత్యేక కమిషనర్ సెల్వమణి, జిల్లా స్వీప్ సమితి అధ్యక్షుడు కాంతరాజు, స్వీప్ నోడల్ అధికారి ప్రతిభా తదితరులు పాల్గొన్నారు.

శిడ్లఘట్టలో...

శిడ్లఘట్ట, మార్చి 31: లోక్‌సభ ఎన్నికల్లో వందశాతం ఓటింగ్ లక్ష్యంగా తాలూకా స్వీప్ సమితి ఆధ్వర్యంలో జాగృతి కార్యక్రమాలు చేపట్టారు. పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో ఆదివారం ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యనిర్వాహక అధికారి మునిరాజు నేతృత్వం వహించారు. తాలూకా ఎన్నికల అధికారి జావీద్ నజీమా ఖానమ్, తహసీల్దారు బీఎన్ స్వామి, సీడీపీఓ నౌతాజ్, బీఈఓ, పట్టుశాఖ తదితర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చేళూరులో...

చేళూరు, మార్చి 31: లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలని సూచిస్తూ పలు జాగృతి కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఏప్రిల్ 26న జరిగే పోలింగ్‌లో ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని తాలూకా స్వీప్ సమితి సూచించింది. ఈమేరకు తాలూకాలోని అన్ని గ్రామాలలో పలు రీతులలో ర్యాలీలు, ప్రతిజ్ఞా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పీడీఓలు, సర్పంచ్‌ల నేతృత్వంలో ర్యాలీలు చేపట్టారు. కళాశాలల్లో సైతం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనదని, ప్రలోభాలకు లోను కాకుండా ఓటు వేయాలని అధికారులు సూచిస్తున్నారు. ఆదివారం కూడా పలు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు కొనసాగాయి.



ఓటు హక్కుపై ప్రతిజ్ఞలో అధికారులు, సిబ్బంది బృందం

పెరిగిపోతున్న ఎండలు

- తీరం జిల్లాల్లో ఇంటిపైన స్ప్రింక్లర్లు
- పనులు చేస్తూ ఉపాధి కూలి మృతి



శరణప్ప (ఫైల్)

బెంగళూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి. ఉత్తర కర్ణాటక జిల్లాల్లో 40 డిగ్రీలకుపైగా నమోదవుతుండడంతో ప్రజలు బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. కలబురగి, బీదర్, బాగల్కోటె, రాయచూరు, విజయపుర జిల్లాల వ్యాప్తంగా రోజువారీ ఎండలు పెరుగుతున్నాయి. 1996 తర్వాత రాష్ట్రంలో ఎండలు పెరిగిన ప్రభావం ఇదే ఏడాదిగా ఉంది. 1996లో ఉత్తర కర్ణాటకలోని పలు జిల్లాల్లో గరిష్ఠంగా 44.6 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. ఆ తర్వాత ఇదే తొలిసారిగా 40 డిగ్రీలు అధిగమించింది. ఆదివారం కలబురగి జిల్లా అళంద తాలూకా దన్నూరు గ్రామంలో ఉపాధి కూలీ శరణప్ప సమగార (42) నరేగా పనులు చేస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలాడు. తోటికూలీలు రక్షించే ప్రయత్నం చేస్తుండగానే తుదిశ్వాస వీడాడు. ఎండవేడిమికి మృతి చెందాడా లేదా గుండెపోటుకు గురయ్యాడా..? అనేది పోస్టుమార్టం నివేదికలో తేలాల్సి ఉంది. నరోనా పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. కాగా కలబురగిలో 40.09 డిగ్రీలు నమోదైంది. బెంగళూరులో 28ఏళ్ల తర్వాత ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదయ్యాయి. 1996లో 37.3 డిగ్రీలు గరిష్ఠంగా నమోదైంది. ప్రస్తుతం మార్చిలో బెంగళూరులో 36డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రత కొనసాగుతోంది. ఏప్రిల్‌లో మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.



ఓ ఇంటిపై స్ప్రింక్లర్ల ఏర్పాటు ఇలా...

స్ప్రింక్లర్లతో చల్లదనం

సముద్రతీర జిల్లాలు దక్షిణకన్నడ, ఉడుపి, ఉత్తరకన్నడ జిల్లాల్లో ఎండవేడిమిని ప్రజలు తట్టుకోలేకపోతున్నారు. మంగళూరులో 35 డిగ్రీల ఉష్ణోగ్రతతో వేడిగాలులు వీస్తున్నాయి. ఇళ్లపైన స్ప్రింక్లర్‌లు ఏర్పాటు చేసుకున్నారు. అందుకు సంబంధించిన ఫోటోలు వైరల్ అవుతున్నాయి. పుత్తూరులో మధ్యాహ్నం 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రత నమోదవుతున్నట్లు తెలుస్తోంది. తోటలు, ఉద్యానవనాలకు వాడే స్ప్రింకర్‌లను వినియోగించడం ద్వారా చల్లదనం పొందే ప్రయత్నాల ఫోటోలు వైరల్ అయ్యాయి.

నేచురలిస్ట్ ట్రైనింగ్ కోర్సుకు విశేష ఆదరణ



ట్రైనింగ్‌లో భాగంగా కబ్బన్‌పార్క్‌లో ఇలా...

బెంగళూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నేచురలిస్ట్ ట్రైనింగ్ కోర్సు అనే పరికల్పన ప్రజాదరణ పొందుతోంది. ప్రజలు ప్రకృతిపట్ల ఆసక్తి కనబరుస్తున్నారు. నేచురలిస్ట్ ట్రైనింగ్ కోర్సు అనేది కేంద్ర ప్రభుత్వం స్కిల్‌ఇండియా కార్యక్రమంలో భాగంగా అమలు చేస్తోంది. దేశంలో ట్రైనింగ్ ఆరంభించిన ఘనత కర్ణాటకకే దక్కుతుంది. ప్రభుత్వ ఏజెన్సీలు, రిటైర్డు అయిన ఐఎఫ్ఎస్ అధికారులతో కలసి ప్రకృతి ప్రేమికులకోసం ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ప్రభుత్వం నైపుణ్యశిక్షణకు సూచించిన 16 కోర్సులలో నేచురలిస్ట్ ట్రైనింగ్ కోర్సు ఒకటి. నెలరోజులపాటు సాగే శిక్షణలో 15రోజులపాటు థియరీ, 15రోజులపాటు ప్రాక్టికల్స్ ఉంటాయి. ప్రకృతిలో జీవించే సీతాకోకచిలుకలు, కీటకాలు, మట్టి, మొక్కలు, ప్రాణులు, వన్యజీవులతో కలిపిన అన్ని అంశాలపై వీరికి శిక్షణ ఇస్తారు. ఇప్పటికే రెండు బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చారు. భవిష్యత్తులో ఆరు నెలలపాటు కోర్సును కొనసాగించే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. గ్రామీణ ప్రాంత ప్రజలకు శిక్షణ ఇవ్వడం ద్వారా ప్రకృతిని రక్షించవచ్చునని భావించారు. అయితే పట్టణాలు, నగరాల్లోనూ ఆసక్తి చూపుతున్నారు. బెంగళూరులో ఇప్పటి వరకు 60మంది శిక్షణ పొందారు. వీరిలో ప్రైవేట్ రిసార్టులు, హోం స్టేలు, అటవీప్రాంతాలలోని రెస్టారెంట్‌ల ద్వారా ప్రకృతికి భంగం కలిగించకుండా తీసుకునే చర్యలపై వారికి శిక్షణ ఇచ్చారు. ప్రత్యేకంగా రాష్ట్రంలో కొడగు, శివమొగ్గ జిల్లాల్లో హోం స్టేలు, చిక్కమగళూరు, మండ్య, మైసూరు, హాసన్‌లలో అటవీప్రాంతాలలో రిసార్టులు, విజయనగర, కొప్పళ జిల్లాల్లో రిసార్టుల సంస్కృతి ఉంది. పర్యావరణ పరిరక్షణ దిశగా ఈ కోర్సుల ద్వారా శిక్షణ ఇస్తున్నామని మాజీ ఐఎఫ్ఎస్ అధికారి ఒకరు తెలిపారు. బెంగళూరులో శిక్షణ పొందినవారికి కబ్బన్‌పార్క్‌లో నైపుణ్యత కల్పించామన్నారు.

ఇక ప్రశాంత జీవనానికి నిర్ణయం : బచ్చేగౌడ

విజయపుర, మార్చి 31: రాజకీయ జీవితంలో ఎన్నో ఎత్తుపల్లాలు చూశానని ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఎంపీగా వివిధ హోదాల్లో 50ఏళ్లు సేవలందించిన తనకు 82ఏళ్లు అయ్యానని మిగిలిన జీవితాన్ని స్వతంత్రంగా, ప్రశాంతంగా జీవించేందుకు నిర్ణయించానని మాజీ మంత్రి బీఎన్ బచ్చేగౌడ తెలిపారు. దేవనహళ్ళి తాలూకాలో విజయ పురలోని సౌమ్యకేశవస్వామి రథోత్సవంలో భాగంగా పూల పల్లకీ ఉత్సవం ఆదివారం జరిగింది. కుటుంబ సభ్యులతో ఉత్సవంలో భాగస్వామ్యులయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగ సమస్య పెరిగిందని ఐదేళ్లలో కేంద్రం నుంచి నియోజకవర్గ అభివృద్ధి గ్రాంట్లకోసం ఎంతో శ్రమించాల్సి వచ్చిందన్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందానని, గ్రాంట్లకోసం చాలా కష్టపడాల్సి వచ్చిందన్నారు. 75 ఏళ్లు పైబడినవారికి ఒక కుటుంబం నుంచి ఒకరికే టిక్కెట్ ఇచ్చేలా బీజేపీ అధిష్ఠానం నిర్ణయం తీసుకోవడంతో తాను రాజకీయాలనుంచి రిటైర్డు కానున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో ఏ పార్టీనుంచి పనిచేసేది లేదన్నారు. బీజేపీ-జేడీఎస్ పొత్తుపై స్పందించేందుకు నిరాకరించారు.



పల్లకి ఉత్సవంలో మాజీ మంత్రి బచ్చేగౌడ తదితరులు

మానసిక ఉల్లాసానికి సంగీతం ఔషధం

బెంగళూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మానసిక ఉల్లాసానికి సంగీతం ఔషధం లాంటిదని ఇండో ఏషియన్ విద్యాసంస్థల చైర్మన్ ఏకాంబరం నాయుడు అభిప్రాయపడ్డారు. ఆదివారం కల్యాణనగర్‌లో గానలహరి 2024 కార్యక్రమాన్ని కర్ణాటక తెలుగు రచయితల సమాఖ్య నిర్వహించింది. సమాఖ్య చైర్మన్ బొగ్గవరపు మాల్యాద్రి, సెంటర్ ఫర్ మ్యూజిక్ అండ్ ఎడ్యుకేషన్ ఈడీ మీనాక్షి రవి, వర్క్ లైఫ్ గురు మేనేజిమెంట్ ప్రొఫెసర్ శ్రీరామ్ దర్బ, రచయిత్రి ఆచంట హైమావతి, ప్రముఖ ఆర్టిస్ట్ కేశనపల్లి మాల్యాద్రి, ప్రధాన కార్యదర్శి కళ్ళే వెంకటేశ్వర శాస్త్రి పాల్గొన్నారు. వర్ధమాన గాయకులను ప్రోత్సహించాలనే సంగీత పోటీలు నిర్వహించామన్నారు. భావ తరంగాలు కవితా సంపుటిని, స్వేచ్ఛాపుష్పం కవితా సంపుటిని ఆవిష్కరించారు. 60మంది గాయకులు భాగస్వామ్యులయ్యారు. ఆరుగురు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సమాఖ్య ప్రతినిధులు సంజీవ్‌కుమార్, లక్ష్మి, నరేంద్రబాబు, ఉద్దండం చంద్రశేఖర్, లక్ష్మణ్ యాదవ్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణలో ప్రముఖులు

నేటి నుంచి పది మూల్యాంకనం

అనంతపురం విద్య, మార్చి 31 : పదో తరగతి పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం సోమవారం నుంచి ప్రారంభం కానుంది. సోమవారం నుంచి 8వ తేదీ వరకూ మూల్యాకనం నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని కేఎస్ఆర్ హైస్కూల్, జూనియర్ కళాశాల ఆవరణలోని పలు గదుల్లో పది మూల్యాంకనం నిర్వహించనున్నారు. మూల్యాంకనానికి అసిస్టెంట్ ఎగ్జామినర్లు, చీఫ్ ఎగ్జామినర్లు, ఇతర సిబ్బందిని 1154 మంది వరకూ నియమించారు. మూల్యాంకనానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారులు చెబుతున్నారు.

కేఎస్ఆర్‌లో స్పాట్....

పదో తరగతి పరీక్షలు మార్చి 18న ప్రారంభమై 30వ తేదీ ముగిశాయి. దీంతో జవాబు పత్రాల మూల్యాంకానికి పాఠశాల విద్యాశాఖ సిద్ధమైంది. ఏప్రిల్ 8వ తేదీ వరకూ స్పాట్ వాల్యుయేషన్ నిర్వహించనున్నారు. కేఎస్ఆర్ హైస్కూల్‌లోని పలు గదులు, వరండాలో, జూనియర్ కళాశాలలో ప్రత్యేకంగా టేబుళ్లు, కుర్చీలు తెప్పించారు. ఎండకాలం నేపథ్యంలో ప్రత్యేకంగా ఫ్యాన్లు అందుబాటులో ఉంచారు. స్పాట్ నిర్వహణ కోసం సిబ్బందిని నియమించారు. ఏఈలు, సీఈలు తెలుగు కోసం 118మందిని, ఇంగ్లీష్ 91, హిందీ 92, గణితం 82, ఫిజికల్ సైన్స్ 88, బయాలజీకి 75, సోషియల్ 100, ఒకేషనల్‌కు మరో ఏడుగురిని నియమించారు. 653 మందికి అదనంగా మరో 30 శాతం మందిని కలిపి 835మందిని నియమించారు. స్పెషల్ అసిస్టెంట్లు మరో 300 మందిని నియమించారు.

స్పాట్‌కు అన్ని ఏర్పాట్లు చేశాం: వరలక్ష్మి

పదో తరగతి స్పాట్‌కు అన్ని ఏర్పాట్లు చేశాం. కుర్చీలు, టేబుళ్లతోపాటు, ఫ్యాన్లు, తాగునీరు అందుబాటులో ఉంచాం. స్పాట్ కేంద్రం వద్ద వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్‌ఓతో మాట్లాడాం. ఆర్‌జేడీతో మాట్లాడి కేంద్రం వద్ద సిబ్బంది సౌకర్యార్థం క్యాంటీన్ కూడా ఏర్పాటుచేసేలా చర్యలు తీసుకుంటాం.

బీజేపీ ప్రణాళికా కమిటీలో రాష్ట్రం నుంచి రాజీవ్‌చంద్రశేఖర్

బెంగళూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ ప్రణాళికా కమిటీలో రాష్ట్రం నుంచి రాజీవ్‌చంద్రశేఖర్‌కు అవకాశం దక్కింది. బీజేపీ ఎన్నికల కమిటీ ప్రణాళికా పర్యవేక్షణ విభాగాన్ని శనివారం ప్రకటించింది. కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో 27మంది సభ్యులను నియమించారు. కర్ణాటక నుంచి కేంద్రమంత్రి రాజీవ్‌చంద్రశేఖర్ సభ్యుడిగా ఉంటారు. ప్రస్తుతం ఆయన రాష్ట్రంనుంచి రాజ్యసభ సభ్యుడిగా వ్యవహరిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కేరళ రాష్ట్రం తిరువనంతపురం నుంచి పోటీ చేస్తున్నారు.

లోక్‌సభ అభ్యర్థి విజయానికి కృషి చేయాలి

బాగేపల్లి, మార్చి 31: లోక్‌సభ ఎన్నికల్లో భిన్నాభిప్రాయాలను పక్కనపెట్టి చిక్కబళ్ళాపుర కాంగ్రెస్ అభ్యర్థి రక్షా రామయ్య విజయానికి కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్యే సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. పట్టణ శివారులోని గడిదం లక్ష్మీ వెంకటేశ్వర ఆలయంలో అభ్యర్థి విజయం కోసం ఆదివారం విశేషపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిక్కబళ్లాపుర టిక్కెట్‌ను మాజీ సీఎం వీరప్పమొయిలీ, గౌరిబిదనూరుకు చెందిన మాజీ మంత్రి శివశంకరరెడ్డిలు ప్రయత్నించారని అయితే అనూహ్యంగా విద్యావంతుడైన జాతీయ యువ కాంగ్రెస్ కార్యదర్శి రక్షా రామయ్యకు టిక్కెట్ దక్కిందన్నారు. ఈ సందర్భంగా రక్షా రామయ్య, దొడ్డబళ్ళాపుర మాజీ ఎమ్మెల్యే వెంకటరమణ, ఎమ్మెల్యేలు శరత్‌బచ్చేగౌడ, ప్రదీప్ ఈశ్వర్‌తోపాటు ప్రముఖులు మంజునాథరెడ్డి, శ్రీనివాసరెడ్డి, లక్ష్మీనరసింహప్ప, లంభూ శ్రీనివాస్ పూజప్ప తదితరులు పాల్గొన్నారు.

బన్నేరుఘట్టరోడ్డు ఏడాదిపాటు మూసివేత

బెంగళూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మెట్రో నిర్మాణ పనుల్లో భాగంగా బన్నేరుఘట్ట మెయిన్ రోడ్డులోని మైకో సిగ్నల్ నుంచి ఆనేపాళ్య జంక్షన్ దాకా సుమారు రెండుకిలోమీటర్ల మేర ఏడాదిపాటు మూసివేయాలని నిర్ధారించారు. నమ్మమెట్రో పనుల్లో భాగంగా లక్కసంద్ర సొరంగ మార్గంలో నిర్మాణాలు ఆరంభం కానున్నాయి. ఏప్రిల్ 1 సోమవారం నుంచి ఏడాదిపాటు మూసివేయనున్నారు. బన్నేరుఘట్ట మెయిన్‌రోడ్డు డెయిరీ సర్కిల్ నుంచి ఆనెపాళ్య జంక్షన్‌వైపు వెళ్లే వాహనాలు మైకో సిగ్నల్ నుంచి కుడివైపు తిరిగి బోస్‌లింక్ రోడ్డు ద్వారా ఆడుగూడి సిగ్నల్‌కు చేరుకుని ఎడమవైపు వెళ్లాల్సి ఉంటుంది. ఆనెపాళ్య జంక్షన్ నుంచి డెయిరీ సర్కిల్‌కు వెళ్లే వాహనాలకు ఎటువంటి సమస్య ఉండదు. డైయిరీ సర్కిల్‌నుంచి శాంతినగర్ వెళ్లే వాహనాలు విల్సన్‌గార్డెన్ 7వ మెయిన్‌రోడ్డుమీదుగా వెళ్లాల్సి ఉంటుందని బీఎంఆర్‌సీఎల్ అధికారులు ప్రకటించారు. కాళేనఅగ్రహార (గొట్టిగెరె) నుంచి నాగవారవైపు వెళ్లే పింక్‌లేన్ మెట్రో అత్యంత పొడవుగా 21.26 కిలోమీటర్లు నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. ఇందులో 13.76 కిలోమీటర్ల మేర సొరంగ మార్గంలోనే నిర్మిస్తారు. 2025 చివరినాటికి నిర్మాణాలు పూర్తి కానున్నాయి.

స్టేషన్‌లోకి దూసుకెళ్లి... ఏఎస్ఐపై మహిళ దాడి

బెంగళూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పోలీస్ స్టేషన్‌లోకి దూసుకెళ్లి విధి నిర్వహణలో ఉన్న అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్‌పై బాటిల్‌తో దాడి చేసి తీవ్రంగా గాయాలపాలు చేసిన సంఘటన గంగమ్మ గుడి పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. శనివారం సాయంత్రం అశ్విని అనే మహిళ ఒక్కసారిగా స్టేషన్‌లోకి దూసుకెళ్లింది. విధి నిర్వహణలో ఉన్న ఏఎస్ఐ నాగరాజ్‌పై దాడి చేసింది. ఆయన తప్పించుకునే ప్రయత్నం చేస్తుండగానే చేతికి బలమైన గాయాలయ్యాయి. ఆస్తి విషయంలో అన్యాయం జరిగిందని మహిళ బాటిల్‌తో దాడి చేసింది. వెంటనే ఏఎస్ఐను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. దాడికి పాల్పడిన అశ్విని మానసిక స్థితి బాలేదని తెలుస్తోంది. ఆమెను నిమ్హాన్స్ ఆసుపత్రిలో చేర్పించారు. గంగమ్మ గుడి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

ఆదిభట్ల సాహిత్యం సమాజానికి కనువిప్పు

● మోదుగుల రవికృష్ణ

ప్యారీస్, మార్చి 31: హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు సాహిత్యం సమాజానికి కనువిప్పు కలిగిస్తుందని గుంటూరులోని విశ్వనాథ సాహిత్య అకాడమీ కార్యదర్శి మోదుగుల రవికృష్ణ పేర్కొన్నారు. వేద విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహిక 147వ కార్యక్రమం టి.నగర్ ఆంధ్రాక్లబ్ కృష్ణా హాలు వేదికగా ఆదివారం సాయంత్రం జరిగింది. వక్త మోదుగుల రవికృష్ణను వేద విజ్ఞాన వేదిక అధ్యక్షుడు జేకే రెడ్డి, కార్యదర్శి కందనూరు మధు సంప్రదాయ బద్ధంగా శాలువతో సత్కరించారు. అనంతరం 'ఆదిభట్ల నారాయణదాసు వ్యక్తిత్వం - సాహిత్యం' అనే అంశంపై వక్త ప్రసంగిస్తూ తెలుగు ప్రజలమదిలో సుస్థిర స్థానం సంపాదించుకున్న ఆదిభట్ల హరికథ, సాహిత్య రంగంలో రాణించారని కొనియాడారు. ఆ రంగాలకు ఆయన చేసిన కృషిని తనదైన శైలిలో ఆయన వివరించారు. పామరుల నుంచి పండితుల దాకా వారి హృదయాలను హత్తుకునేలా ఆదిభట్ల కలం నుంచి జాలువారిన సాహిత్యాలన్నీ ఆణిముత్యాలేనని అన్నారు. చెన్నై నగరంలో తెలుగువారి మధ్య మహా పండితుడైన ఆదిభట్ల నారాయణదాసు వ్యక్తిత్వం, సాహిత్యం గురించి ప్రసంగించే అవకాశం రావటం ఆనందంగా ఉందని, వేద విజ్ఞాన వేదిక తరతరాల తెలుగు కవిత కార్యక్రమం వందేళ్లపాటు ఇలాగే కొనసాగాలని మోదుగుల రవికృష్ణ ఆకాంక్షించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మడకశిరటౌన్, మార్చి 31: మడకశిర మండలం ఆమిదాలగొంది గ్రామ సమీపంలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్ణాటక రాష్ట్రం చెళ్లకెరె నియోజ కవర్గం గౌరీపురానికి చెం దిన శంకర్(45) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తి వన్నూరప్పకు గాయాలుకాగా మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఏఎస్ఐ బ్రహ్మానందరెడ్డి సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఏఎస్ఐ అందించిన మేరకు.. కర్ణాటకలోని గౌరీపురానికి చెందిన శంకర్, వన్నూరప్ప ఇద్దరూ ద్విచక్ర వాహనంలో పెనుకొండ నియోజకవర్గం రొప్పాల గ్రామానికి బయలుదేరారు. రాజవంతి నుంచి ఆమిదాలగొందికి వెళ్తున్నారు. అదే సమయంలో మడకశిర మండలంలోని అచ్చంపల్లి నుంచి బియ్యం లోడుతో మడకశిర వైపు వెళ్తున్న లారీ ఢీకొనడంతో శంకర్ అక్కడికక్కడే మృతి చెందగా వన్నూరప్పకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వన్నూరప్పను మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్సలు అందిస్తు న్నారు.